# ఆడతనం

కొండముది శ్రీరామచంద్రమూర్తి

ఆరు దాటిన సూచనగా వీధంతా నిద్ర మేల్కొంది. పిల్లలూ, పెద్దలూ బూత్ పాలు సీసాల్లో తెచ్చుకుంటున్నారు.

ఇంకా రత్తాలు రాలేదు. రత్తాలు వస్తేనే కాని ఇంట్లోకి పాల సీసారాదు.

ఆరున్నర. కూరగాయల బండీవాడు వచ్చి వెళ్ళాడు.

రత్తాలు రాలేదు కూరగాయలు ఇంట్లోకి కొనలేదు. సోమవారం తోటకూర, మంగళవారం బచ్చలికూర, బుధవారం పొన్నగంటికూర, గురువారం పాలకూర... ఏ వారం ఏ కూర కొనాలో, ఎంత కొనాలో దానికే తెలుసు

ఏడు గంటలు. కాన్వెంటు పిల్లలు వాకిట్లో నిలుచున్నారు, రత్తాలు కోసం.

ఇంకా రత్తాలు రాలేదు. రత్తాలు రాకపోతే వాళ్ళెట్లా కాన్వెంటుకు వెళ్ళడం?

ఆమె కళ్ళల్లో సూదంటురాయి వుంది. ఆమె గొంతులో పాలనురుగులోని వెచ్చదనముంది. ఆమె వేళ్ళల్లో వాత్సల్యముంది సూదంటురాయి వెనకాలే నవ్వుకుంటూ తుళ్ళుకుంటూ ప్రేమగా-ఇష్టంగా యూనిఫారాల్లో వున్న పసిడి బొమ్మలు పాఠాల గుడికి పరుగులు పెడతారు

ఏడు దాటింది ఎనిమిది దాటింది. ఉదయం మధ్యాహ్నమైంది. మధ్యాహ్నం సాయంత్రమైంది సూర్యుడు నిద్రపోయాడు. మళ్ళీ నిద్రలేచాడు. మొగ్గలు పూవులైనాయి. రాత్రులు పగళ్ళయినాయి, పూవులు వాడి రాలిపోయినాయి, పగళ్ళు రాత్రులైనాయి

రత్తాలు పనిలోకి రాలేదు

నాలుగురోజులుగా పాలబూత్ క్యూలో నేనే నిలబడుతున్నాను. నాలుగురోజులుగా కూరల బండీవాడిదగ్గర మా ఆవిడే కూరలుకొంటున్నది. నాలుగురోజులుగా గునుస్తూ, ఏడుస్తూ, గొడవ చేస్తూ తండ్రుల వెంట పిల్లలు కాన్వెంటుకు పోతున్నారు కాఫీ కప్పు టేబిలుమీద పెట్టి, విసుగ్గా అన్నది కమల. "ఇహ ఆ రత్తాలు పనిలోకి వచ్చేట్టు కనబడడం లేదు. ఈ బాధలు ఇంకా ఎన్నాళ్ళు పడతాం? మరో సీతాలును పెట్టుకుందాం"

కమలవేపు ఆశ్చర్యంగా చూశాను కమలేనా ఆ మాటంటున్నది? కమల నా కళ్ళల్లోకి సూటిగా చూడలేక మొహం అటు ప్రక్కకు తిప్పుకున్నది. కమల కాపరానికి వచ్చేటప్పటికి రత్తాలు నాలుగేళ్ళ పిల్ల. రత్తాలు నాయినమ్మ మా ఇంట్లో పనిచేసింది. రత్తాలూ వాళ్ళ అమ్మ బుడిగి మా అమ్మ దగ్గర పనిచేసింది. రత్తాలు వోణీలు వేసుకోకుండానే కమల దగ్గర చనువు సంపాదించింది. మా అమ్మాయిలు మొదటిసారిగా నీళ్ళుపోసుకున్నప్పుడు, వేవిళ్ళతో సతమతమైపోతున్నప్పుడు, కాన్పు కష్టమై కంగారుపడుతున్నప్పుడు, దగ్గరుండి ధైర్యం చెప్పి వాళ్ళనో గట్టు చేర్చింది. మా ఇద్దరబ్బాయిలకూ పెళ్ళిళ్ళు కుదిరి, కోడళ్ళు కొత్తగా కాపురానికి వచ్చినప్పుడు, ముందస్తుగా తానే ఎదురువెళ్ళి, కాళ్ళు కడుగు నీళ్ళ పళ్ళెం పట్టి, గుమ్మాల దగ్గర పేర్లు చెప్పించి, ఇంటికి పని మనిషిగా కాక ఆడకూతురుగా మెలిగింది.

అటు ప్రక్కకు మొహం తిప్పుకున్న కమల, పమిటచెంగు వేలికి చుట్టుకుంటూ అలవోకగా అన్నది. "ఈ అలగా జాతి వాళ్ళింతేనండీ! వాళ్ళకు విశ్వాసం వుండదు."

రత్తాలు విశ్వాసం లేనిదంటే నాకు నమ్మకం లేదు. ముప్పై ఏళ్ళకు పైబడి అది మా ఇంట్లో పనిచేస్తున్నది. ఎప్పుడూ అది కావాలని కానీ, ఇది కావాలనికానీ అడిగైనా ఎరగదు. ఏదైనా ఇస్తే పుచ్చుకొన్నది. ఇయ్యకపోతే వూరుకుంది. మేం సకుటుంబంగా ఇంటికి తాళాలు వేసి వూళ్ళకు వెళ్తే, విశ్వాసంగా వరండాలో చాప వేసుకుని పడుకుంది.

"కమలా! నీకు మనుష్యుల్ని అర్థం చేసుకోవడం తెలీదు." అన్నాను కొంచెం [illegible]ంగా. కమల చివాలున తలెత్తింది. "ఇప్పుడు దాన్ని నేను అర్థం చేసుకోకపోతే కొంపలేం మునిగిపోవు కానీండి, వో రహస్యం చెప్పనా?" అన్నది.

"నువు చెప్పడం, నేను వినడం పాతికేళ్ళకు పైగా నేను చేస్తూనే వున్నాను. ఇందులో కొత్త ఏముందీ-ఆ చెప్పేదేదో తొందరగా చెప్పు. కాలేజీకి కాస్త ముందస్తుగా వెళ్ళాలి ఇవ్వాళ."

"మీ రత్తాల్ని దాని మొగుడొదిలేశాట్ట!"

నేను ఉలిక్కిపడ్డాను. "నిజమా?"

"ఆహా! పచ్చి నిజం!"

"ఏమొచ్చిందే. ఆ దౌర్భాగ్యుడికి?"

"వాడికి రాలేదు, దానికే వొచ్చింది. పెళ్ళయి ఇరవై ఏళ్ళుగా కాపురం చేసుకుంటున్నా, ఆడదాని కడుపు పండకపోతే, కట్టుకున్న వాడికి తల తీసేసినట్టుండదూ? అందుకనే దాన్నొదిలి పెట్టేసి మరోదాన్ని కట్టుకున్నాట్ట దాని మొగుడు!"

"అంట్ల వెధవ!" నాకుకోపం ఆగడంలేదు. "తనచేతకాని తనానికి ఓ ఆడకూతురికి అన్యాయం చేస్తాడా?"

"అది వాళ్ళల్లో మామూలేనండీ! ఉన్నన్నాళ్ళు కలసి మెలసి వుంటారు. కట్టు తప్పినాడు, కాదు పొమ్మంటారు. ఇవ్వాళ వాడు దాన్ని పొమ్మన్నాడు. రేపది మరోహణ్ణి కట్టుకుంటుంది, టింగురంగా మంటూ వూరేగుతుంది"

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు కమలా!" బాధగా అన్నాను. "వాళ్ళూ మనుష్యులే! వాళ్ళకూ మనలాగే బోలెడన్ని సెంటిమెంట్స్ వుంటాయి."

కమల నవ్వింది, ఎగతాళిగా. "ఈ సెంటిమెంట్స్, ప్రెడిషన్స్ అన్నీ మిడిల్ క్లాస్ వాళ్ళకేనండీ! పూర్ పీపుల్స్‌కు బ్రతకడం ఎట్లాగో తెలుసు."

కమలతో వాదన అనవసరం. ఆ కళ్ళు పచ్చ కామెర్ల కళ్ళు. ఆ గుండె చప్పుడు ప్రిజుడిస్డ్ సౌండ్స్‌ని తప్ప మరేవీ రికార్డ్ చేయదు.

చొక్కా తొడుక్కుని, కాళ్ళకు చెప్పులు వేసుకుంటుంటే, "ఇప్పుడెక్కడికండీ? కాలేజీకి తొందరగా వెళ్ళాలన్నారు కదా, వంట పూర్తయింది, భోంచేసే వెళ్ళండి" అన్నది.

"ఓసారి రత్తాలు దగ్గరకు వెళ్ళొస్తాను."

కమల కళ్ళు పెదవైనాయి. "ఇప్పుడా?"

"అవును. ఇప్పుడే!"

"దాని ఇల్లెక్కడో మీకు తెలుసా?"

రత్తాలును చూస్తుంటే ఈసారి మరింత జాలి వేసింది. దాని మొగుడికి వాడి చీకటిఆకలి తీరడానికి ఎవరో ఒకరు కావాలి. రెండో పెళ్ళాం పుట్టింటికివెళ్తే, మొదటి పెళ్ళాం వాడికిగరువచ్చింది. ఆడ యవ్వనం మత్తెక్కించింది....

"తెలీదు"

"మరెట్లా వెళతారూ?"

నోట్లో నాలికంటూ ఒకటి వుందిగా?"

ఆశ్చర్యం! ఇన్నేళ్లుగా రత్తాలు మా ఇంట్లో పనిచేస్తున్నా దాని ఇల్లెక్కడో మాకు స్పష్టంగా, ఇదమిద్ధంగా తెలీదు. దాన్ని, దాని మొగుడు పువ్వుల్లోపెట్టి చూసుకుంటున్నాడో, మంటలకొలిమిలో కాలుస్తున్నాడో ఇంతవరకూ తెలీదు. దాని కడుపున ఓ నలుసెందుకు కాయ లేదో మాకు అక్కరలేకపోయింది. అది వేళకు వచ్చి పనిచేసి వెళ్ళిపోతే మాకు చాలు. దాని శ్రమతో ముడిపడివున్న మా బ్రతుకులకు ఏ ఆటంకమూ రాకుండా వున్నంతకాలం, అది ఏమైపోయినా మాకు అక్కర్లేదు.

వీధిలోకి వచ్చి, ఓవర్ బ్రిడ్జి దాటి, పార్కు దాటి, బస్‌స్టాండుకు వచ్చేవరకూ మనసంతా వో కందిరీగల తుట్టెలావుంది. బస్సుస్టాండులో బస్సుల రణగొణ ధ్వనులు. కొవ్వలి, పోతునూరు, దెందులూరు మొదలైన వూళ్ళనుండి వచ్చివెళ్లే ప్రయాణీకుల హడావిడి కబుర్లు రోడ్డుమీద జనం ప్రవాహంలా వుంది. షాపుల్లో రద్దీ అనంతంగా వుంది. ఆకాశంలో ఎండ మిక్కుటంగా వుంది.

రత్తాలును ఎట్లా కనుక్కోవడం? లక్షా పాతికవేల పైచిలుకువున్న ఈ మహాపట్నంలో అయిదున్నర అడుగుల ఎత్తుకూడాలేని రత్తాలు చామనచాయలో సామాన్యంగా కనిపించే రత్తాలును ఎట్లా పట్టుకోవడం?

"బాబుగారూ!"

చివాలున వెనక్కు తిరిగాను. రత్తాలు! వెతకబోయిన తీగె! తీగలా సన్నబడి, నల్లగా వాడిపోయి, మొహానంతా చెమటతో, గాలికి ఎగురుతున్న జుట్టుతో, రిక్షాలోంచి దిగుతున్న రత్తాలు. రిక్షాలో పాలబిందెలు.

"కులాసాగా వున్నారా బాబూ?–అమ్మగారూ, పిల్లలూ..."

"పన్లోకి రావడం లేదేం రత్తాలూ?"


రత్తాలు రిక్షావాడితో ఏదో చెప్పింది. వాడు అట్లాగేనంటూ తలూపి గంటమోగించుకుంటూ, పాలబిందెలు తీసుకుని రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

నేను మళ్ళీ అదేప్రశ్న వేశాను. "పన్లోకి రావడంలేదేం రత్తాలూ?"

రత్తాలు తలవొంచుకుని సమాధానం చెప్పింది. "ఆడు నన్నొగ్గేసినాడు బాబూ!" ఆ గొంతులో బాధ భరితమైన కదలిక స్పష్టంగా తెలుస్తోనే వుంది.

నేను సమాధానం చెప్పలేదు. మెల్లిగా రత్తాలుతో నడుస్తూ, బస్సు దాటి, రైలుగేటుదాటి, పోలీసు గొడుగుదాటి, కుడివేపుకు తిరిగి, గాంధీ నగరంలోకి ప్రవేశించాం. ఒకలైనుగాలేని గొలుసుల గుడిసెలు. గుడిసెలపై గుడిసెలు. గుడిసెల ముందు మురికి కాలువలు. కాలువల్లో విశ్రాంతి తీసుకుంటున్న పందులు. పందులకు మందలుగా పిల్లలు.

రత్తాలు వో గుడిసెముందు ఆగింది. గుడిసె ముందు కళ్లాపు చల్లి ముగ్గు పెట్టబడి వుంది.



గుడిసె గోడలకు సున్నంబొట్లు. మురికి కాలువపై అడ్డంగా నాపరాళ్ళు.

"లోపలకు రండి బాబూ!"

లోపల మంచం వాల్చింది. నేను కూర్చొనీ, కూర్చోకుండానే, బయటినుండి వేడివేడి కాఫీ తీసుకొచ్చింది వో సత్తుగ్లాసుతో. సత్తుచంచాతో ఓ చుక్క తన నోట్లో పోసుకుని "సక్కెర తక్కువేసినాడు బాబూ!" అంటూ వో పాత డబ్బాలోంచి కాస్త పంచదారతీసి గ్లాసులో వేసి, చెంచాతో కలియబెట్టి, "తీసుకోండి బాబూ! మళ్ళీ ఆరిపోద్ది. ఏడి తగ్గినా, సక్కెర తగ్గినా, బాబుగోరికి బావుండదు. అన్నది. ఆమె ఆప్యాయతకు నాకళ్లు చెమరుస్తున్నాయి. "నిజమే రత్తాలూ!" అంటూ ఆగ్లాసునందుకున్నాను.

బయటినుంచి ఎవరో పిల్లలొచ్చి లోపలకు తొంగిచూసి వెళ్ళిపోయారు. దూరంగా రైలు కూత. ఎక్కడినుండో మైకులోనుండి అశ్లీలపు సినిమా పాటలు.

నాదగ్గరనుండి గ్లాసునందుకుని కిందపెట్టింది. గడపదగ్గరగా కింద కూచుని, "బాబుగోరూ ఓ మాటడుగుతాను. నిజం సెపుతారా?" అన్నది

"తప్పకుండా చెబుతాను. నిస్సంకోచంగా అడుగు."

"నేను బావుండనా బాబూ?" రత్తాలు గొంతులో అమాయకత్వం

ఆమె వేపు పరిశీలనగా చూశాను. యౌవన చెదరని, పసివాడని అవయవ సౌష్టవం పెద్ద కళ్ళు. కళ్ళకు కాటుక. నల్లని నొక్కులజుట్టులో వాడిన మల్లెపూలు. మోకాళ్ళపైకి కట్టుకున్న ముతకచీర మోకాళ్ళమీద కనిపించే కండల గట్టిదనం.

"ఎవరన్నారు నువ్వు బావుండవని?"

"ఆడే అన్నాడు. నాతోతొంగున్నా ఆడికింక పిల్లలు పుట్టరంట. అందుకనే ఆడు మళ్ళీ మనువాడాడంట!"

"పిచ్చి రత్తాలూ!" ఆమె కంటివెంట కారిన కన్నీటి బొట్లను కొనగోటితో తుడిచాను.

"వాసన చూసిన పువ్వును అవతలకు విసిరి వేయడానికి వాడాడిన నాటకం ఇది. నీకేం బంగారు బొమ్మవు."

"నాకు పిల్లలెందుకుపుట్టరు బాబూ?" రత్తాలు గొంతులో సిగ్గు.

"ఎందుకు పుట్టరూ? తప్పకుండా పుడతారు. ఎవరో నూటికి కోటికి ఒక్కరికి తప్ప అందరు ఆడవాళ్ళకూ ప్రకృతి అందించే మహత్తరమైన భాగ్యం అది."

"కాదు బాబూ! మీకు తెలీదు. ఆ నంబి ఆచార్లుగోరు నాకు మాత్తర్లు కూడా ఇచ్చాడు. అవి తినితిని నా పేణం ఇసిగిపోయింది. ఇంక నాకు పిల్లలు పుట్టరని ఆయనే చెప్పిండు."

"నేను నిన్ను పెద్ద డాక్టరుచేత పరీక్ష చేయిస్తాను."

"ఒద్దు బాబూ! పరీచ్చలూ, గట్రా ఇంకా నాకేం వొద్దు. ఆడు నన్ను వొగ్గీసీడు. మళ్ళా మనువాడే. ఇప్పుడు పిల్లలుట్టారని డాట్టర్లు సెప్తే మాత్రం నాకేటి నాబంబాబూ! అందుకని ఇట్టాగే నేను బెతకదల్చుకుండా!"

"ఒంటరిగా ఎంతకాలం బ్రతుకుతావ్ పిచ్చిదానా? పోనీ—అటాగే అశోకవృక్షంలా వొంటరిగానే వుండిపోతావే అనుకో! దానికీ, మా ఇంటికి రాకపోడానికీ సంబంధం ఏవిటే?—ఎందుకట్లా అర్థాంతరంగా మానివేశావూ?"

"మొగుడు కాదన్నదాన్ని, పిల్లా పీచు లేదాన్ని, లచ్చిందేవిలాంటి ఆ అమ్మగారి మొహాలు పొద్దున్నే సూట్టం నాకు కట్టమైంది బాబూ! సెప్పాపెట్టకుండా,—సెపితే ఎట్టాగూ ఇనరని— ఇట్టా సేశాను. పొరుగూళ్ళ నుంచి పాలు కొనుక్కొచ్చి అవి మారుబేరానికి అమ్ముతుండాను!"

"నీకి కష్టసమయంలో తెలిసిన మా అందర్నీ కాదనుకుని, వూరూవూరూ తిరిగి పాలు కొనుక్కునివచ్చి, రాత్రిపూట వంటరిగా, పగటిపూట ఎండలో, చెమటలో—ఎందుకు రత్తాలూ, ఇంత బాధ?"



ఆ పత్రికక్క

ఒక వర్ధమాన రచయిత ఓ వర్ధమాన పుస్తక సంపాదకుడితో "ఫలానా పత్రికలో అన్నీ చెత్త కథలే పడతాయి." అన్నాడు. "అలా అయితే మీ కథలన్నీ ఆ పత్రికకే పంపండి. తిరిగిరావు" జవాబిచ్చాడు తాపీగా సంపాదకుడు.

—శరగడం విశ్వేశ్వరరావు (అనకాపల్లి)

"ఇంత యాతనా పడకపోతే, నా మనసు నన్ను వూరకుండనీదు బాబూ! ఏదో పని, పాత గ్నాపకాన్ని కాదనడానికి!"

"మేమందరం నీవాళ్ళం రత్తాలూ! పోనీ, పనికోసం కాకపోతే, కనీసం చూచిపోతుండటానికైనా వస్తూ పోతూ వుండరాదూ?"

రత్తాలు గభాలున నాకు వంగి పాదాభివందనం చేసింది. "దయగల మారాజులు మీరు! పెద్ద మనసుగలవారు. కానీ ఆడోళ్ళ సంగతులు మీకు తెలీవు బాబూ! తెలిసినోళ్ళ సూపులు నాకు ఈటెల తూపులు. ఆళ్ళమాటలు కత్తుల మంటలు. ఆళ్ళముందు నేను తలొంచుకు బెతకనేను. నన్నిట్టాగే వుండనీండి బాబూ!"


"ఎప్పుడు రాదల్చుకున్నా, నీకు మా ఇంటి తలుపులు తెర్చేవుంటాయి. మర్చిపోకు."

"అట్టాగే బాబూ! మంచి గడియలు రానీండి మళ్ళీ తప్పకుండా వత్తాను."

ఆ మంచి ఘడియలు రత్తాలుకు మరో రెండేళ్ళకుగానీ రాలేదు. ఈలోపల నేను ఆమెను ఒకటి రెండుసార్లు కలుసుకున్నాను. రత్తాలు కొంచెం లావు చేసింది. వంట్లో మరింత నవనవ చేరింది. కళ్ళలో బ్రతుకుపై తీపి. వ్యాపారంలో లాభాలు. కాళ్ళకు పట్టెడ. వంటిమీద బిగుతైన రెవికలు. ముక్కుకు ముక్కెర. చెవులకు ఎర్రని దుద్దులు. ఆమె నడుస్తుంటే స్త్రీత్వం జండా ఎగరవేస్తున్నది. ఇదే సంగతి, ఏదో మాటల్లో, కమలతో అన్నాను.

"చూస్తుండండి. అదీ ఎవణ్నో ఒకణ్ని కట్టుకుంటుంది." అన్నది కమల ఈసడింపుగా.

"నో, నో. రత్తాలు అట్లా చేయదు." అన్నాను.





కఠినాత్ముడు

"మాఆవిడ సంగీతం వింటే రాళ్లుకూడా కరిగి పోతాయ్." ఇంటికి వచ్చినతనితో తన భార్య గురించి గొప్పలు చెప్ప సాగాడు రత్నం.

"మీరింకా కరిగిపోలేదు అంటే మీరు రాళ్ళకన్నా కఠినాత్ములన్నమాట!" దెబ్బకు దెయ్యాన్ని వదిలించేసుకున్నాడు అతిథి.

—పట్టపు ప్రభాకరరావు (పాలకొల్లు)

"ఏవిటా భరోసా?—అదేదో మీ కూతురైనట్టు! అది మాత్రం అందర్లా ఉప్పూకారం తింటున్న మనిషి కాదూ?"

"కావచ్చు కానీ దాని దగ్గరవున్న నీతి మరోరివగ్గు లేదు"

"ఆ సంగతి మికెట్లా తెలుసూ?"

"చూస్తే తెలియదూ?"

"చూపులకూ చేతలకూ ఎంతో తేడా వుంటుంది అదే మీకు తెలీదు."

"పోనేద్దూ! నీకుతెలిస్తే, అర్ధాంగినైనందుకు, సహం నాకు తెలిసినట్లే కదా?"

ఇట్లా మేం మాట్లాడుకుని వారం రోజులైనా కాలేదు ఓ సాయంకాలం వేళ, కొప్పు నిండా ఇన్ని పూలు తురుముకుని, కొత్త చీర కట్టుకుని, ఘల్లుఘల్లుమని చప్పుడుచేసుకుంటూ రత్తాలు మా ఇంటికి వచ్చింది.

వస్తూవస్తూ కమలకి పళ్లు పట్టుకు వచ్చింది వీధిలో పిల్లలందరికీ స్వీట్లు తీసుకు వచ్చింది ఆమెను చూస్తే మలయమారుతం జ్ఞాపకం వచ్చింది నిండాపూచిన అశోకం కనిపించింది.

వీధిలో వాళ్ళంతా రత్తాలును చుట్టుముట్టారు ఒకటే ప్రశ్నలు.

"ఇన్నాళ్ళూ ఎక్కడకు పోయినావురత్తాలూ?"

"చెప్పకుండా, పెట్టకుండా అట్లా వున్నట్టుండి మాయమై పోవడం నీకు బావుందా?"

"పోన్లే మళ్ళీ రేపట్నుంచి తప్పకుండా రా!"

"పాపం, నీ మొగుడు నిన్నొదిలి పెట్టేశాట్ట కదా?"

"వాడు మళ్ళీ పెళ్ళి కూడా చేసుకున్నాట్ట కదా?"

"నువ్వు పాల వ్యాపారం చేస్తున్నావా? అయ్యయ్యో- నీకు ఆ ముదనష్టపు వ్యాపారాలు ఎందుకు రత్తాలూ!-శుభ్రంగా పనిపాటలు చేసుకుని బ్రతక్క!"

"నీ కోసం మా అమ్మడు దిగులెట్టుకుంది వారం రోజులు"

"నువ్వు రాకపోతే, కూరలు తరగబోయి, వేలు కోసేసుకున్నాను."

రత్తాలు అందరి మాటలూ వోపిగ్గా వింది. అందరికీ అన్ని సమాధానాలు చెప్పిపంపించింది

"ఇంకా నే నీ పనిలోకి రానుగాక రాను" అంది. "పిల్లలకేం తెలుసు పాపా, నీళ్ళూ! రేపటికి ఆళ్ళే మర్చిపోతారు" అన్నది. "బతకడం కోసం ఏ వ్యాపారం సేసినా ఏం తప్పు నేదు" అన్నది జీవన వేదాంతం తెలిసిన దానిలా.

అందరూ పోయిన తర్వాత, నన్నూ కమలనూ ఒకచోట కూర్చోపెట్టి, రెండు చేతులనూ మా కాళ్ళకు ఆనించి నమస్కరిస్తూ, "దీవించండి నన్ను!" అన్నది.

"ఏవిటి విశేషం రత్తాలూ?" అన్నది కమల తనకు అంతా అయోమయంగా వున్నది.

"ఆడు మళ్ళీ నా దగ్గరకు ఒచ్చిండు!"

"మరి, ఆ రెండో పెళ్ళాం ఏమైంది?"

"ఏం కాలేదమ్మా!" రత్తాలు నవ్వింది. "పుటింటి కెళ్ళింది."

"ఏం, దాన్నీ ఒదిలిపెట్టేశాడా?"

"కాదమ్మా! ఆవిడ కనడానికెళ్ళింది ఇంకో మూణ్నెళ్లదాకా రాదంట!"

రత్తాలును చూస్తుంటే ఈసారి మరింత జాలివేసింది దానిమొగుడికి వాడి చీకటి ఆకలి తీరడానికి ఎవరో ఒకరు కావాలి. రెండో పెళ్ళాం పుట్టింటికి వెళ్తే, మొదటిపెళ్ళాం వాడికి గుర్తు వచ్చింది. రత్తాలు పిటపిటలాడే యౌవనం వాడికి మత్తెక్కించింది. పిచ్చి రత్తాలు ఈ రహస్యం తెలియక, వాడు తన దగ్గరకు రావడమే పరమార్థమనుకుంటున్నది. ఈ మాట నేను ఆ అమాయకురాలితో ఎట్లా చెప్పనూ?

ఇద్దరమూ రత్తాలుకు మనః పూర్వకంగా ఆశీస్సులందించి, భర్త నిరంతర సాహచర్యంలో సుఖసంతోషాలందుకోమని పంపించాము. కమల రత్తాలుకు చీర, జాకెట్టూ ఇచ్చి, బొట్టు పెట్టడం నాకు ఆశ్చర్యాన్ని కల్గించినా, సంతృప్తిని కూడా కల్గించింది. ఎంతైనా ఒక స్త్రీకి మరొక స్త్రీకి మధ్యనున్న అజ్ఞాతమైన సానుభూతికి అది చిహ్నమనుకుంటాను.

రత్తాలు చెప్పిన మూడునెలలూ ఇట్టే గడిచి పోయ్యాయి. ఈ మూడునెలల్లోనూ రత్తాలు మొగుడు, రత్తాలు గుడిసెలోనేకాపురంపెట్టాడు. రత్తాలుకు పగలే వెన్నెల కాసింది. ఒకటి రెండుసార్లు బస్సుస్టాండు దగ్గర కనబడి," మీది మా గొప్పమాట బాబూ! ఆడిప్పుడు నా కొంగట్టుకు వదల్డంలేదు." అన్నది గర్వంగా. దాని కళ్ళు మిలమిలలాడాయి. దానివొళ్ళు తళతళలాడ్తున్నది.

అయిదోనెలలోనో, ఆరోనెలలోనో, సరిగ్గా జ్ఞాపకం లేదు, రత్తాలు యాదృచ్ఛికంగా నాకు గాంధీనగరం హైస్కూలు దగ్గర కనిపించింది. మనిషి మొహం పీక్కుపోయింది. కళ్ళల్లో ఆ కాంతి లేదు. శరీరం నల్లకప్పు వేసుకుంది. చేతి గాజులు వదులుగా క్రిందకు జారిపోయాయి.


రత్తాలుకు ఎదురుగా జంగిడీ వుంది. జంగిడీలో పిల్లలు తినే రకరకాల తినుబండారాలు. దాని చేతిలో ఈగలను తోలడానికి మాసిపోయిన ఓ గుడ్డ కుంచె విసనకర్ర ...

"ఏవిటి రత్తాలూ ఇది?" నా కంఠం నాకే తెలియకుండా గద్గదికమైంది.

నన్ను చూడగానే రత్తాలుసిగ్గుతో, అవమానంతో చిరిగిపోయిన చీర చెరగుతో మొహం కప్పుకుంది. "ఏంసెప్పనుబాబూ? అంతా నా కర్మ!" అన్నది ఆ తర్వాత కాస్త స్థిమితపడి, వేదాంత ధోరణిలో.

"ఖర్మను నమ్ముకుని ఈ దేశంలో ఎవరూ బాగుపడలేదులే! అసలు సంగతేమిటో చెప్పు".

"పురుడోసుకుని నాసవతొచ్చింది, ఇంకేం,



ఆ ఎఱ్ఱతోలు కనిపించగనే అడు నన్నో పీకి పారేసిన టెంకిలా ఇసిరేసిపోయిందు."

"మళ్ళ వాస్తాళ్లే దిగులుపడకు!"

నేనన్నట్టుగానే రత్తాలు మొగుడు మళ్ళీ వచ్చాడు. వాడి రెండో పెళ్ళాం అటు పురుటికి వెళ్ళడం, వాడు ఇటు రత్తాలు కాళ్లపట్టుకోడం ఒకసారి జరిగాయి.

ఈ సారి రత్తాలు కొంచెం తెలివి తెచ్చుకుని బెట్టుచేసింది.

"ఎందుకురా, నన్నిటా ఏపుకు తింటావ్?" అన్నదిట రత్తాలు కళ్ళలో నీళ్ళతో.

"ఏపుకు తినడం కాదే ఎఱ్ఱిమొగమా! నీకా పిల్లలు లేకపోయే? దానిదా కోడి కానుపు!! నువ్వంటే నాకు ప్రేమతగ్గదు. అదేమో పిల్లల్ని కనడం మానదు. ఏం సేమంటావో నువ్వే సెప్పవే?"

వాడి మనస్సు రత్తాలుకు స్పష్టమైంది. వాడికి పిల్లలూ కావాలి, యౌవనం దిగజారని పెళ్లామూ కావాలి. పిల్లలకు రెండవభార్య, కోర్కె తీర్చ డానికి మొదటిపెళ్ళాం. ఇదీ బాగానే వుందనిపించింది ఆ వెర్రిదానికి. ఆ రెండోభార్య వచ్చినా, తన మగడు తనదగ్గరకు రావడం మానుకోలేక పోతున్నాడు. అది నీళ్ళు పోసుకున్నపుడెల్లా వాడు తనస్వంతంకాక తప్పదు, రత్తాలు నవ్వుకుంది గర్వంతో. తన శరీరంవంక చూసుకుంది ఆనందంతో.

ఆరాత్రి మొగుణ్ణి కౌగలించుకొనిపడుకొని వాడుతను తపనతో కామంతో ముద్దుపెట్టుకున్నప్పుడు, ఆశగా, ఆత్రంగా అడిగింది. "అది కాదురా, ఒకవేళ నేనూ, నీ సిన్నపెళ్ళాం నాగా..."

"ఏందే...?" అన్నాడువాడుమరింతగాఆమెను దగ్గరకు లాక్కుంటూ.

"నేనూ నీళ్ళోసుకుంటే"..." రత్తాలుమాట పూర్తి చేయకుండా వాడి గుండెలో ఒదిగిపోయింది. వాడు పెడీపెడీ నవ్వాడు. కరుకు కరుకుగా నవ్వాడు నవ్వినవ్వి అలసిపోయాడు.

"ఆ సౌభాగ్గెమ్ వుంటే నువ్విట్టా ఎందుకు వుంటావే పిచ్చిమొద్దూ?"

"అదికాదురా, వొకేళ నేనూ వోబిడ్డ తల్లినై..."

"అదీనువ్వూకూడా పిల్లల్ని కంటావుంటే, నేను ఇద్దర్నీ ఒదిలేసి దేశంమీదకుపోతా!"

"అదేందిరా?" రత్తాలు బేలగా అడిగింది.

"ఏందేమరి, నాను మగమడిసిని కాదనుకున్నావేటి? మీరిద్దరూ బిడ్డల్నేసుకుని మంచాల్లో తొంగుంటుంటే, నానేంసెత్తాను?...ఇంకోదాన్ని సూసుకుంతాను"

రత్తాలుకు ఒళ్లు ఝల్లుమంది. వాడి నోటిగుండానేకాక, వాడి మనసులోకూడా కల్లు వాననవేసింది. వాడి మగమూర్ఖత్వం తెలిసి మూగగా రోదించింది. ఏడుస్తూనే వాడిపక్కకు చేరింది.

ఇదంతా కమల ఒకరోజు సాయంకాలం నేను కాలేజీనుండి రాగానే చెప్పింది.

"నీకెట్లా తెలుసూ?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆస్పత్రికి వెళ్ళాస్తే తెలిసింది: రత్తాలే చెప్పింది."


"ఆస్పత్రికి వెళ్ళడం ఏవిటే, అక్కడ రత్తాలు చెప్పడం ఏవిటే?— కాస్త వివరంగా చెప్పు." కమల నావేపు నిష్ఠూరంగా చూసింది. "మగవాడికోసం రత్తాలు ఎబార్షన్ చేయించుకుంది. కట్టుకున్నవాడు తనకు దూరం కాకుండా వుండడం కోసం ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంది. తాళిబొట్టు కోసమని, తల్లి మనసును కూడా చంపుకుంది. ఈ దేశంలో ఆడతనం అనుభవిస్తున్న దుర్భర నరకం... భగవంతుడా!!"

మగవాణ్ణయినందుకు సిగ్గుతో తలవొంచుకోవలసి వచ్చింది. రత్తాలును చూడటానికి ఆస్పత్రికి వెళ్ళినప్పుడు, ఆ అభాగ్యురాలిని ఏమని ఓదార్చాలో నాకు తెలీలేదు.

"ఎందుకు బాబూ బాధపడతారు? నేను మారు మనువాడొచ్చు, కానీ ఆడను. నాకో నీతుంది. అడికే నేదు. నీతిలేనివాడి పెళ్ళాన్నయినందుకు నాకీ శిచ్చ తప్పదు" అన్నది బరువుగా.

అప్పుడప్పుడూ రత్తాలు నాకు కనిపిస్తుంటుంది, రకరకాల వ్యాపారాల్లో, రకరకాల స్థలాల్లో. ఆమెను చూడగానే తెలుస్తుంటుంది. అది ఆమె జీవితంలో కృష్ణపక్షమో, శుక్లపక్షమో!

శుక్లపక్షంలో ఆమె ఆడతనం వికసించిన పారిజాతంలా భ్రమలు గొల్పుతుంటుంది. కృష్ణపక్షంలో, వేసవినీటి ఊటలా ఎక్కడో అడుగున దాగివుంటుంది. ❋



తవ్వండి

ఓ ఆయిల్ పరిశోధనాసంస్థబస్ ఆయిల్ అయిపోవడంలో మార్గమధ్యంలో ఆగిపోయింది.

ఇక్కడెక్కడయినా పెట్రోలు పడుతుందేమో త్రవ్వండి" అజ్ఞాపించాడు ఆఫీసరు.

—వట్టపు ప్రభాకరరావు (పాలకొల్లు)

# వాస్తు శాస్త్రమా?

మేము ప్రచురించిన 'మనుషుల జాతకాలని మార్చే వాస్తు శాస్త్రం' సెంటర్ స్ప్రెడ్ పై పాఠకుల నుండి భిన్నాభిప్రాయాలు విపరీతంగా వచ్చాయి.

**అసలు 'వాస్తు' శాస్త్రమా? కాదా?- అది మనుషుల జాతకాలని మార్చగలదా? ఈ విషయంపై చర్చావేదిక ప్రారంభిస్తున్నాం.**

ఈ చర్చలో పాఠకులు ఉత్సాహంగా పాల్గొనాలని విజ్ఞప్తి.

-ఎడిటర్ ❋